# జననీ, జన్మభూమి

'రాడార్‌స్క్రీన్' మీద 'టైమ్‌బేస్' (విమాన దూరాన్ని, దిశనీ గుర్తించే కాంతిరేఖ) నిర్విరామంగా తిరుగుతోంది. విమానం 'సిగ్నల్' కనిపించగానే 'పొజిషన్' వివరాలు 'ఇంటర్‌కమ్' ద్వారా రికార్డర్‌కి, ప్లాటర్‌కీ తెలియజేస్తున్నాడు.. అబ్జర్వర్ స్థానంలో కూర్చున్న అనంద్.

ఉన్నట్లుండి స్క్రీన్ అంతా రకరకాల కాంతిరేఖలతో నిండిపోయింది. విమానాల వివరాలేమీ తెలియటం లేదు. అంతా అలుక్కు పోయినట్లు అయోమయమై పోయింది. వెంటనే అలారం మ్రోగించాడు. అనంద్. సాంకేతిక నిపుణులు పరుగున వచ్చారు. 'కంట్రోలర్స్ స్కోప్స్' కూడ అలాగే ఉన్నాయి. చకచక తమ పని ప్రారంభించారు.

"ఏమైంది?" పై నుంచీ కమాండర్ ప్రశ్నించాడు.

ఆయన క్యాబిన్ వైపు చూస్తూ "ఇ.సి.ఎమ్.సార్" అన్నాడు మళ్లీ పనిలోకి తల దూరుస్తూ, (ఎలక్ట్రానిక్ కౌంటర్ మెజర్ లేక జామింగ్) ఒక టెక్నీషియన్.

"యాంటీ జామింగ్ సర్క్యూట్ అపరేట్ చెయ్యండి" ఆదేశించాడు కమాండరు.

"లాభంలేదు సార్, ఇదేదో పవర్‌ఫుల్ జామింగ్... మన యాంటీ జామింగ్‌కి లొంగటం లేదు..."

"అల్‌రైట్! జామింగ్ ఏ దిశలో ఉంది?"

"జీరోనుండీ తొంభైడిగ్రీల మధ్య ఉంది!"

"అంటే- శత్రువిమానాలు ఆ దిశనుండే వస్తున్నాయన్నమాట... మీ ప్రయత్నాలు మీరు చేస్తుండండి..." అంటూ వైర్‌లెస్ ట్రాన్స్‌మిటర్ అందుకుని, మిస్సయిల్స్‌కి, శతఘ్నులకి ఆదేశాలిచ్చాడు.

"యస్... జీరో టు నైంటీ డిగ్రీస్... కిల్ ది టార్గెట్ ఆన్ సైట్..." ఫీల్డు టెలిఫోన్ మీద కూడా ఆదేశాలిచ్చి రాడార్ స్క్రీన్ వద్దకు క్యాబిన్‌లొంచి దిగివచ్చాడు.

"హరిహరమూర్తీ! కాంబట్ ఎయిర్ పెట్రల్‌లో ఉన్న మిగ్స్‌ని కాంటాక్ట్ చేసి ఏదన్నా శత్రువిమానాల జాడ తెలిసిందేమో అడుగు" కంట్రోలర్‌కి పురమాయించాడు. అతను వైర్లెస్ అందుకున్నాడు.

అక్కడ అందరి మొహాల్లోనూ 'టెన్షన్' స్పష్టంగా తెలుస్తోంది.

రాడార్ టెక్నీషియన్లు తమ శాయశక్తులా రాడార్ జామింగ్ ని తొలగించేందుకు కృషిచేస్తున్నారు.

అంతలో బయట పేలుడు శబ్దాలు అయినాయి.

భూకంపంలా వచ్చి నేల అదిరింది.

కుర్చీలు, బల్లలు కంపించాయి.

'షాక్' తిన్నట్లు ఒకరికేసి ఒకరు చూసుకున్నారు.

శతృ విమానాలు దాడిచేసినట్లు అందరికీ అర్థమైపోంది.

అందరూ కమాండర్ కేసి చూశారు. "ఎవరూ కదలొద్దు. కంగారుగా ఎటూ పరుగులు తీయొద్దు. మీ పనిలో మీరు వుండండి" గంభీరంగా అని చేతులు కట్టుకు నిలబడ్డాడు ఆయన.

అందరి మనస్సుల్లోని అదుర్దా, ప్రాణభీతి మెల్లగా శాంతించాయి. ఎవరి పనిలో వారు నిమగ్నులయారు.

బయట సైరన్లు మోగుతున్నాయి.

శతఘ్నుల పేలుడు శబ్దాలు మేఘాలు గర్జించినట్లు జెట్‌విమానం రొద- కొన్ని సెకన్లు అలా గడిచిపోయింది. పెద్ద శబ్దం అయింది. ఆ తర్వాత మరికొన్ని శబ్దాలు విమానం కూలిపోయిన గుర్తుగా సైరన్లు. అంతలో 'వైర్లెస్' పలికింది "టార్గెట్ వన్ కిల్డ్! టూ మోర్ ఇన్ ఆర్బిట్" (ఒక విమానం కూలిపోయింది. మరో రెండు పైన తిరుగుతున్నాయి) మరి కొద్దిక్షణాల్లో రాడార్ తెరమీద జామింగ్ విడిపోయి మామూలుగా వచ్చేసింది అప్పుడు తోకముడిచి పారిపోతున్న రెండు విమానాలూ కనుపించాయి. వెంటనే ఎవరి స్థానాల్లో వాళ్లు కూర్చుని శత్రు విమానాలు ఉనికిని గమనిస్తూ. సంబంధిత సమాచారాన్ని అప్పటికే ఆకాశంలో ఉన్న ఫైటర్ విమానాలకు అందించారు. వెంటనే అవి శతృవిమానాల వైపు దూసుకుపోయాయి. కొద్ది నిముషాల్లోనే అవి శత్రు విమానాలను తరిమి, తమ అందుబాటులోకి రాగానే క్షిపణులతో కూల్చేశాయి.

వెంటనే ఆ సమాచారాన్ని వైర్‌లెస్ ద్వారా క్రిందకు తెలియజేశాయి. అందరి మొహాల్లో సంతోషం వెల్లివెరిసింది.

హుషారుగా కరచాలనం చేసుకున్నారు.

ఆనంద్ రాడార్ స్క్రీన్ మీదనే దృష్టి నిమగ్నంచేసి, శత్రువిమానాల ఉనికిని పసిగట్టే ప్రయత్నంలో ఉన్నాడు. 'టైమ్ బేస్' నిర్విరామంగా నిమిషానికి అయిదు మాట్లు తిరుగుతూనే ఉంది.

అంతలో 'రిలీవింగ్ షిఫ్ట్' వాళ్ళొచ్చి బాధ్యతలు తీసుకోసాగేరు.

అనంద్ 'స్కోప్' ముందునుండీ లేచి, రిలీవర్‌కి చోటిచ్చాడు.

రిలీవ్ అయినవాళ్లందరూ బయటకు నడిచారు.

"ప్రియమైన ఆనంద్-

నీ కింతవరకు రాసిన మూడు ఉత్తరాలకి నీనుండి జవాబు లేదు. అసలు నీకు ఉత్తరాలు అందుతున్నాయా లేదా అనే సందేహం కలుగుతోంది. మళ్లీ అంతలోనే యుద్ధం కదా తీరిక లేకుండా ఉన్నావేమో ననుకుంటుంటాను.

ఇక లాభం లేదు ఆనంద్, నన్ను మావాళ్లు ప్రశాంతంగా ఉండనీయటం లేదు. వాళ్లు చెప్పినట్లు తలవంచమటమో, లేకపోతే నీకు దక్కలేదన్న బాధతో ఆత్మహత్య చేసుకోవటమో నాకు మిగిలింది. ఆత్మహత్య చేసుకోనని నీమీద ఒట్టేయించుకు మరీ వెళ్లావు. ఎన్నాళ్లు మనకీ బాధలు! వద్దు వద్దంటే అందులో జేరావు. ఇప్పుడు చూడు, సమస్యలు పెరుగుతున్నాయే గాని పరిష్కారం దొరకటం లేదు. మీ అమ్మ కూడా ఈ పెద్ద వయసులో ఒంటరిగా ఎంతో యిబ్బంది పడుతూ, నీకోసం దిగులుతో బాధపడుతోంది. అందులోంచి బయటపడే మార్గం ఏదైనా ఉంటే చూడు, ఇక్కడే ఏదైనా ఉద్యోగం చూసుకోవచ్చు. అదీ కాకపోతే చిన్నవ్యాపారం చేసుకోవచ్చు. దీనితోపాటు మీ అమ్మ రాయించిన ఉత్తరం జతచేస్తున్నాను.

వెంటనే జవాబు రాయి...

ప్రేమతో, నీ స్వప్న.

"చిరంజీవి ఆనంద్‌ని ఆశీర్వదించి  మీ అమ్మ వ్రాయించునది.

నీనుండి ఎలాంటి సమాచారములు తెలియక ఆందోళన పడుతున్నాను. స్వప్న అప్పుడప్పుడు వచ్చి నా క్షేమాలు కనుక్కుంటోంది. నా ఆరోగ్యం ఏమీ బావుండటంలేదు. గుండెలో తరచుగా నొప్పి వస్తోంది. మన ఇంటివద్ద డాక్టర్ కొసరాజు గారే మందులు ఇస్తున్నారు. ఇక్కడ ఉన్నపుడు రోజూ నిన్ను కళ్లతో చూసుకునే దానిని. నీ మాటలు వినేదానిని. మళ్లీ నిన్ను చూస్తానా, మాటల వింటానా అని దిగులుగా ఉంది. నీ ఆరోగ్యం జాగ్రత్త. వేళకి భోజనం చేస్తుండు.

వెంటనే సమాధానం రాయగలవు.

ఇట్లు - ఆశీస్సులతో మీ అమ్మ

"ఏమిటి దీర్ఘాలోచనలో పడ్డావు?" చనువుగా భుజంమీద చెయ్యి వేస్తూ ప్రశ్నించాడు రెడ్డి.

"మనం రాసిన ఉత్తరాలు సరిగా వెళ్లటం లేదా?"

"ఏం?"

"నేను రాసిన మూడు ఉత్తరాలు యింతవరకు జేరలేదుట!"

"ఈ మధ్య పోస్టాఫీసుమీద బాంబు పడిందిగా. అప్పుడేమైనా అటుయిటూ అయినాయేమో?" నవ్వేడు.

"వచ్చేవి వస్తున్నాయే..."

'అవి ఆర్.ఎమ్.ఎస్.డెలివరి అనుకుంటాను. ఇంతకి ఏమిటి విషయం? ఇంటి దగ్గర అంతా క్షేమమేనా?"

"ఈ ఉత్తరాలు చదువు నీకే తెలుస్తుంది"

"ఇదేదో ప్రేమలేఖలా ఉంది..." సంశయంగా అన్నాడు.

ప్రియమిత్రుడిగా నీకా చనువుంది. పరవాలేదు చదువు..!

రెడ్డి మౌనంగా ఉత్తరాలు రెండూ చదివాడు.

గాఢంగా నిట్టూర్చేడు

"మనం యిప్పుడు రెండు యుద్ధాల్లో ఉన్నాం!!"

అనంద్ రెడ్డి మొహం కేసి చూశాడు.

"ఒకటి మాతృదేశం కోసం చేస్తున్నాం. రెండోది కన్నతల్లి పట్ల మన నైతిక బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించు కోలేక మనసుతో సంఘర్షణ పడుతున్నాం. ఈ విషయంలో మనిద్దరి సమస్యలూ ఒకటే..."

"అంటే..."

"అవును. మా అమ్మగారి ఆరోగ్య పరిస్థితి కూడా ఏమీ బాగాలేదు. అవిడకి డయాబెటిస్ మీద స్ట్రోక్ వచ్చింది. గత కొద్దినెలలుగా అవిడ మంచంమీదనే ఉంది"

"నువ్వన్నట్లు ఒక యుద్ధం చేయొచ్చు. రెండు యుద్ధాలు ఎదురయితే ఏం చెయ్యాలో తోచకుండా ఉంది. దానికి తోడు క్షణమొక యుగంగా ఎదురు చూస్తున్న స్వప్నకు, నాకు అంతా అయోమయంగా ఉంది రెడ్డీ..."

"శలవు అడగాలన్నా నోరురాని పరిస్థితి ఇది! ఒకపక్క శలవుల్లోను, రిజర్వ్‌లోను ఉన్నవాళ్లందరినీ డ్యూటీలో జేరమని పిలుస్తున్నప్పుడు మన సమస్య నెలా చెప్పుకుంటాం. దేశానికొచ్చిన ముప్పుకంటే మనది ఎక్కువకాదు కదా? ఇక్కడ అనుక్షణం జీవన్మరణ సమస్య. ఏ నిముషంలో ఏమిటో తెలియని పరిస్థితి..."

"కాస్సేపు కునుకు తియ్యి, మళ్లీ ఓ అరగంటలో డ్యూటీకి వెళ్లాలి కద?"

"అరగంటలో నిద్రేం పడుతుందిలే. నేను కూడ ఇంటికి ఉత్తరం రాయాలి... నీ పెన్ను ఇలా అందుకో..."

"ఆనంద్! నిన్ను కమాండెంటు పిలుస్తున్నారు"

"వస్తున్నాను..." డ్యూటీ మరొకరికి వప్పగించి బయల్దేరాడు. అతను వెళ్ళే సరికే రెడ్డితో మాట్లాడుతున్నాడు కమాండెంటు.

"కమాన్ ఆనంద్! మీ రిద్దరూ ఒకే బ్యాచ్‌ట కద?"

"అవున్సార్" అన్నాడు ఆనంద్ వినయంగా.

"బాంబర్స్ రాడార్‌ల మీద, మిస్సయిల్స్ మీద కూడా ట్రయినింగ్ అయ్యార్ట కద?"

"అవున్సార్, కొన్నాళ్ళు మిస్సయిల్స్ మీద కూడా పనిచేశాం ..."

"వెరీగుడ్! ఇప్పుడు మీ రిద్దరూ ఒక అతి ముఖ్యమైన పనిచెయ్యాలి..."

"చెప్పండి సార్..."

"మిస్సయిల్ యూనిట్‌మీద శత్రువిమానాలు దాడిచేశాయి తెలుసుగా..."

"విన్నాను సార్. ఎవరయినా గాయపడ్డారా?"

"అవును...అందుకే మీ యిద్దర్నీ పిలిపించాను. మీరిద్దరూ మిస్సయిల్స్ మీద పనిచెయ్యాలి... మీరు తప్ప అందుబాటులో ఎవ్వరూ లేరు.."

"తప్పకుండా వెళ్తాం సార్"

"వెరీగుడ్! బయట జీప్ రెడీగా ఉంది. మరో పదినిముషాల్లో మీరు బయల్దేరొచ్చు..."

"అలాగే సార్..."

ఫోను మోగింది.

"యస్. ఎవరూ! ఆనంద్ మదరా?..." వింటున్నాడు.

బయటకు వెళ్లబోతున్న ఆనంద్, రెడ్డి ఆగిపోయారు.

గంభీరంగా మారిపోయిన ముఖకవళికలతో ఫోన్‌లో మాట్లాడటం ముగించి క్రెడిల్ చేశాడు కమాండెంటు. ఆయన మొహం విచారంగా ఉంది.

"ఆనంద్! అయామ్ వెరీ సారీ.... మీ అమ్మగారు చనిపోయినట్లు టెలిగ్రాం వచ్చిందట అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసుకి..."

పిడుగులు పడుతున్నట్లు ఖిన్నుడై నిలబడిపోయాడు.

"టెలిగ్రాం ఇక్కడికి పంపిస్తున్నారట. అప్లికేషన్ పెట్టు శలవు మంజూరు చేస్తాను..."

మౌనంగా నిలబడిపోయాడు ఆనంద్. రెడ్డి అప్లికేషను తేవటానికి వెళ్ళాడు. మరికొద్ది నిముషాల్లో టెలిగ్రాం అంది చదువుకున్నాడు ఆనంద్, క్రింద మామ పేరు కనిపించింది. టెలిగ్రాం క్రితంరోజు ఇచ్చారు. అంటే తల్లి శరీరం పంచభూతాల్లో లీనమయివుంటుందీ సరికి! టెలిగ్రాం మడిచి జేబులో పెట్టుకున్నాడు.

"నేను మిస్సయిల్ యూనిట్‌కి వెళతాను సార్..." అన్నాడు ఆనంద్, అప్లికేషన్‌తో లోపలకు వస్తున్న రెడ్డితోపాటు కమాండెంటు కూడా నిశ్చేష్టులయ్యారు.

ఆ చూపుల్లోని అర్థం గ్రహించినట్లు "నాకు పిచ్చెక్కలేదు సార్! బాగానే ఉన్నాను. మా అమ్మ నిన్ననే పోయింది. నేను వెళ్లటానికి రెండు రోజులు పడుతుంది. వెళ్లినా ఆమె కనుపించదు. అందుకే నా అవసరం ఎంతో ఉన్న డ్యూటికి వెళదామనుకుంటున్నాను..." స్థిరంగా అన్నాడు. కమాండెంట్ కళ్లలోంచి నీళ్లు చిప్పిల్లాయి. ప్రేమగా భుజం తట్టి మౌనంగా అభినందించాడు అతన్ని!

(యువ దీపావళి ప్రత్యేక సంచిక)